క్లుప్తంగా

అన్న సమారాధనకు రూ.లక్ష విరాళం



ఆలయ కమిటీ ప్రతినిధికి విరాళం అందజేస్తున్న రఘు, అప్పలరాజు

పూసపాటిరేగ : మండలంలోని కొత్తకొప్పెర్లలో నిర్వహిస్తున్న పార్వతమ్మ జాతరలో అన్న సమారాధనకు కొవ్వాడ సర్పంచ్ కోట్ల రఘు, గోవిందపురం వైస్ సర్పంచ్ బాలా అప్పలరాజులు రూ.లక్ష విరాళాన్ని ఆలయ కమిటీ ప్రతినిధులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్వతమ్మ అమ్మవారు కరుణ కటాక్షాలు భక్తులపై చూపించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఇనకోటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలతో పేదలకు మేలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

విజయనగరం: పేద, మధ్య తరగతి కుటుంబాల వారికి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయుక్తమని తోష్నివాల్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు వెత్సా సత్యనారాయణమూర్తి అన్నారు. తోష్నివాలా వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెడికవర్ ఆస్పత్రి సౌజన్యంతో కంటోన్మెంట్ ఉడా కాలనీ పార్క్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. శిబిరానికి హాజరైన వారికి బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి వంశీధర్, ప్రతినిధులు జి.పి.దానూక, నాలుగెస్సుల రాజు, ఏరియా కో ఆర్డినేటర్, ఆర్‌సీ కర్రోతు సత్యం, కె.ఎర్నాయుడు, క్లబ్ సభ్యులు తమ సేవలు అందించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

విజయనగరం అర్బన్: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను రాజకీయాలకు అతీతంగా పాలకులు నిర్వహించాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం సందర్భంగా స్థానిక ప్రైవేటు సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ మేరకు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండుసార్లు ఎమ్మెల్సీగా గెలిచిన గాదె శ్రీనివాసులునాయుడు ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం కృషి చేసిన అనుభవం ఉందని అలాంటి వ్యక్తి మరలా చట్టసభల్లోకి రావాలంటే ఎన్నికలు ప్రజాసామ్యబద్ధంగా జరగాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎ.సదాశివరావు, ఆపస్ జిల్లా అధ్యక్షుడు ఇజ్జురోతు రామునాయుడు, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.ఈశ్వరరావు, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాస్, ఉత్తరాంధ్ర మీడియా ఇన్‌చార్జ్ బంకపల్లి శివప్రసాద్, రావాడ రాంబాబు, వై.శంకరనాయుడు, టీ.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నగర పంచాయతీ కమిషనర్‌కు పదోన్నతి



అప్పలరాజు

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీ కమిషనర్ కె.అప్పలరాజుకు ఉద్యోగోన్నతి లభించింది. గ్రేడ్ - 2 మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి పొందిన ఆయన విజయనగరం నగర పాలక సంస్థకు అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. కేటగిరీ-1 మేనేజర్‌గా ఉన్న ఆయన ప్రస్తుతం నెల్లిమర్ల నగర పంచాయతీ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు ఆయనకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. విజయనగరం అసిస్టెంట్ కమిషనర్‌తో పాటు నెల్లిమర్ల నగర పంచాయతీ కమిషనర్‌గా కూడా అదనపు బాధ్యతలు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



పౌష్టికాహారం అందచేస్తున్న వైద్యాధికారిణి భాగ్యరేఖ

పూసపాటిరేగ : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని రెల్లివలస పీహెచ్‌సీ వైద్యాధికారిణి భాగ్యరేఖ అన్నారు. మండలంలోని రెల్లివలస పీహెచ్‌సీలో పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సరైన పద్ధతిలో పౌష్టికాహారం వినియోగించుకున్నట్లయితే ఆరోగ్యవంతంగా వుంటారన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

శతశాతం అక్షరాస్యతే ధ్యేయం



శతశాతం అక్షరాస్యతను సాధించాలని వయోజన విద్య ఉప సంచాలకులు అల్లు సోమేశ్వరరావు అన్నారు. పూసపాటిరేగలో ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా సంబంధిత కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం ద్వారా గుర్తించిన 48,578 మంది పొదుపు సంఘాల మహిళలు, అంగన్‌వాడీ ఆయాలు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులను గుర్తించామన్నారు. వారిలో అక్షరాస్యతను పెంచేందుకు 4857 మంది వలంటీర్లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఆర్థిక మోసాలు, డిజిటల్ అక్షరాస్యతపై వివరించారు. ఎంఎల్‌ఓలు హరీష్, ఈశ్వరరావు, వలంటీరు మేరీకుమారి పాల్గొన్నారు.

– పూసపాటిరేగ

బాల్యం నుంచే సమగ్రాభివృద్ధి



పిల్లల సమగ్రాభివృద్ధి బాల్యం నుంచే జరగాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి కేవీ రమణ అన్నారు. డెంకాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి 120 రోజుల సర్టిఫికెట్ కోర్సులో భాగంగా ఆరు రోజుల పాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేయాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంఈఓ-2 శ్రీరాము, హెచ్‌ఎం కృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సత్యవతి, శైలజ, రీసోర్స్ పర్సన్స్ రవి, రాంబాబు, సూర్యారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

– డెంకాడ

గ్రామాల పరిశుభ్రతలో ప్రజలదే కీలక పాత్ర



గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలదే కీలకపాత్ర అని, చెత్తను పారిశుద్ధ్య కార్మికులకు అందజేసి వారికి సహకరించాలని డీపీఆర్‌సీ జిల్లా కోఆర్డినేటర్ బీఎస్ఎన్ పట్నాయక్ అన్నారు. నెల్లిమర్ల మండలంలోని సీతారామునిపేట ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని ఆయన ఎంపీడీఓ రామకృష్ణరాజుతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలకు తరలించాలన్నారు. వారి వెంట కార్యదర్శి బంగార్రాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

– నెల్లిమర్ల రూరల్

అనధికార నిర్మాణాలపై చర్యలు

విజయనగరం: అనధికార, అనుమతులు లేని నిర్మాణాలను ఉపేక్షించబోమని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా 23వ డివిజన్‌లో ఆయన మంగళవారం పర్యటించారు. పేర్ల వారి జంక్షన్ నుండి ప్రారంభమైన పరిశీలన కార్యక్రమంలో అనేక ప్రజా సమస్యలను తెలుసుకుని సాధ్యమైనవి అక్కడికక్కడే పరిష్కరించారు. వాణిజ్యపరంగా ఉన్న వీధులు కావడంతో ఆయా వీధుల్లో పారిశుధ్యం అలాగే క్రమబద్ధీకరణ చర్యలు కచ్చితంగా పాటించాలని సిబ్బందికి సూచించారు. చిన్న వీధిలో కాలువను ఆక్రమించి నిర్మాణాలు చేపడం పట్ల మందలించారు. తక్షణమే ఆక్రమిత నిర్మాణాలను తొలగించి వేసి కాలువపై పలకలు వేయాలని సిబ్బందికి ఆదేశించారు. కాలువల్లో చెత్తాచెదరాలను గమనించి తక్షణమే పూడికలను తొలగించాలని సూచించారు. రహదారులపై భవన వ్యర్థాలను ఉండడాన్ని గమనించి తక్షణమే సదరు వ్యక్తికి నోటీసులు ఇవ్వాలని ఇక నుండి రహదారులపై డెబ్రిస్ లేకుండా నిరంతర పర్యవేక్షణ ఉంచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తి, టీపీఓ అప్పలరాజు, ప్రజారోగ్య పర్యవేక్షకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



దుకాణదారులతో మాట్లాడుతున్న నగర పాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య

పిల్లల పాలిట వరం

బాలల సమగ్ర ఆరోగ్య పథకం పిల్లల పాలిట వరంగా పరిణమిస్తుందని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. నగరంలోని అన్ని సచివాలయాల పరిధిలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం ద్వారా పిల్లలకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. మందులను కూడా ఉచితంగా అందజేస్తున్నారు. ఆరోగ్య సమస్యలు సకాలంలో గుర్తించడం వాటిని నివారించేందుకు అవసరమైన చర్యలు చేపట్టడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమని కమిషనర్ నల్లనయ్య వివరించారు.

పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలి

ఆర్థిక సంవత్సరం ముగిస్తున్న దృష్ట్యా పన్ను వసూళ్ల ప్రక్రియను వేగవంతం చేసి లక్ష్యాలను అధిగమించాలని రెవెన్యూ సిబ్బందికి, కార్యదర్శులకు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో సచివాలయ వారీగా ఇంతవరకు వసూలు చేసిన వివరాలపై ఆరా తీశారు. ఆర్థిక సంవత్సరం ముగింపునకు 40 రోజులు మాత్రమే గడువు ఉన్నందున ఈ లోగా 29 కోట్ల రూపాయలు వసూళ్లను వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదులో తప్పులు దొర్లరాదు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని రామతీర్థం సచివాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాన్ని ఎంపీడీఓ రామకృష్ణరాజు మంగళవారం పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి నమోదు ప్రక్రియపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని తొమ్మిది గ్రామ సచివాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 21 వరకు ఆయా కేంద్రాల్లో ఆధార్ నమోదు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అలాగే 24 నుంచి 28 వరకు నమోదు కొనసాగుతుందన్నారు. ఆధార్ నమోదులో ఎటువంటి తప్పులు దొర్లరాదని సిబ్బందికి సూచించారు. ఒకటికి రెండు సార్లు చూసుకొని వివరాలు నమోదు చేయాలని కోరారు. ప్రజల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



రామతీర్థం సచివాలయంలో ఆధార్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పైడితల్లి ఆలయంలో చండీయాగం

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, శ్రీ పైడితల్లి అమ్మవారికి మూలా నక్షత్రం పురస్కరించుకుని స్థానిక మూడులాంతర్లు వద్దనున్న చదురగుడి ఆవరణలో వేదపండితులు చండీయాగం ఘనంగా నిర్వహించారు. చండీయాగం విశిష్టతను వేదపండితులు దూసి శివప్రసాద్ భక్తులకు వివరించారు. అనంతరం యాగంలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి శేషవస్త్రాలను, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



చండీయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

ఉపాధి చట్టాన్ని రక్షించుకోవాలి

నెల్లిమర్ల: ఉపాధి హామీ పథకం వేతనదారులు అప్రమత్తంగా ఉండి ఉపాధి చట్టాన్ని రక్షించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు కిల్లంపల్లి రామారావు పిలుపునిచ్చారు. సీతారామునిపేటలో ఉపాధి పనులు మంగళవారం పరిశీలించి వేతనదార్లతో మాట్లాడారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉపాధి రంగానికి నిధులు కేటాయించలేదని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించుకుంటూ వస్తుందన్నారు. దీనిలో భాగంగా జాబ్ కార్డులు తొలగించి వేతనదార్లను తగ్గించే కుట్ర చేస్తుందన్నారు. యూపీఏ హయాంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో వామపక్షల ఒత్తిడితో ఉపాధి హామీ చట్టం చేసిందని తెలిపారు.



వేతనదారులతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

నేటి నుంచి పార్వతమ్మ జాతర

పూసపాటిరేగ : ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు కొప్పెర్ల పార్వతమ్మ జాతర ఈ నెల 19, 20, 21 తేదీలలో జరగనున్నట్టు ఆలయ ధర్మకర్తలు ఇనకోటి వంశీయులు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే జాతరకు ఆలయ కమిటీ భారీగా ఏర్పాట్లు చేశారు. వేల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో మొక్కులు చెల్లించడానికి క్యూ ఏర్పాటు చేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, జాతర సజావుగా నిర్వహించడానికి ఆలయ కమిటీ సభ్యులతో పోలీస్‌శాఖ సమాయత్తమై ఏర్పాట్లుపై సమీక్షించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భోగాపురం రూరల్ సీఐ జి.రామకృష్ణ, పూసపాటిరేగ ఎస్ఐ ఐ.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 19న బాలానాగమ్మ బుర్రకథ, 20న మెగా డ్యాన్స్ హంగామా వారి డ్యాన్స్ షో, 21న హరిశ్చంద్ర నాటకం ప్రదర్శించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



కొప్పెర్ల పార్వతమ్మ అమ్మవారు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డెంకాడ: విద్యుత్ లైన్ల నిర్వహణ, కొత్తగా 11కేవీ వీసీబీ ఏర్పాటు పనుల కారణంగా మండలంలోని డెంకాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని విజయనగరం ఏపీఈపీడీసీఎల్ ఈఈ జి.సురేష్‌బాబు తెలిపారు. మండలంలోని డెంకాడ, గుణుపూరు, గుణుపూరుపేట, ముంగినాపల్లి, డి.కొల్లాం, కె.కొల్లాం, చొల్లంగిపేట, డీఆర్ పాలెం, నగరపుపేట, పోతయ్యపాలెం, పెదతాడివాడ, పినతాడివాడ, గొడిపాలెం, వెదుళ్లవలస, దొడ్డిబాడువ, చందకపేట, మహంతిపేట, లెంకపేట, సింగవరం, నాతవలస గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

చక్కెర కర్మాగార రైతుల సమస్యలు పరిష్కరించాలి

విజయనగరం గంటస్తంభం: జిల్లాలోని భీమసింగి షుగర్ ఫ్యాక్టరీ రైతులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కోరారు. కార్మికులు, ఉద్యోగులకు రావలసిన పీఎఫ్, గ్రాట్యుటీ నేటికి కర్మాగారం చెల్లింపులు చేయలేదని తెలిపారు. కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని, ఉపాధి లేని పరిస్థితి ఏర్పడిందని, వారు పడుతున్న ఇబ్బందులు మంత్రి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. సమావేశంలో కార్మికులు, రైతులు, ఉద్యోగ నేతలు ఉంగరాలశ్రీను, కనకరాజు, సూర్యనారాయణ, ఆదిబాబు, బంగారయ్య, వర్మ, సత్యనారాయణ, మధు పాల్గొన్నారు.

నేడు విగ్రహాల ప్రతిష్ఠ

భామిని: మండలంలోని బాలేరు గ్రామంలో వంశధార నదీతీరాన నిర్మించిన గ్రామదేవత మందిరంలో యోగనిద్రలో ఉన్న మహాశివుని, గ్రామ దేవత విగ్రహాలను బుధవారం ప్రతిష్ఠించనున్నారు. ఆలయ నిర్వాహకులకు దీనికి సంబంధించి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

ప్రజా రవాణాకు అసౌకర్యం కల్పించొద్దు..

విజయనగరం: ప్రధాన రహదారులను ఆక్రమించి తోపుడుబళ్లపై వ్యాపారాలను చేపట్టి ప్రజలకు, ప్రజా రవాణాకు అసౌకర్యం కల్పించరాదని నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య మంగళవారం స్పష్టం చేశారు. గంటస్తంభం, న్యూపూర్ణ జంక్షన్, ప్రకాశం పార్క్ తదితర ప్రధాన రహదారుల్లో తోపుడుబళ్లపై వ్యాపారాలు చేపట్టడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీనిని గమనించిన కమిషనర్ తోపుడుబళ్ల వ్యాపారులతో సమాలోచనలు జరిపి క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టాలని సూచించారు. దీంతో రహదారులు ఆక్రమించి చేపట్టే వ్యాపారాలు తగ్గుముఖం పట్టాయి. అయితే కొంతమంది తోపుడుబళ్ల వ్యాపారులకు అవకాశం ఇవ్వాలని కమిషనర్ చాంబర్‌కు వచ్చి ఆయనను కోరారు. దీనిపై కమిషనర్ పల్లి నల్లనయ్య స్పందిస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగించే ఎట్టి చర్యలను అనుమతించబోమని స్పష్టం చేశారు. ఎవరినీ ఇబ్బంది పెట్టే ఆలోచన తమకు లేదని అయితే క్రమబద్ధీకరణ దిశగా వ్యాపారాలు చేసుకోవాలన్నదే తమ అభిమతం అని స్పష్టం చేశారు.



తోపుడుబళ్ల వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్

24న తాడేపల్లిలోని ధర్నాకు తరలిరావాలి

విజయనగరం గంటస్తంభం: ప్రభుత్వం ఉపాధి పనులు కల్పించి, వలసలను ఆపాలని సీపీఐ నేత, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం బీకేఎంయూ ప్రధాన కార్యదర్శి పురం అప్పారావు, దేవుడు, చంద్రుడు సన్యాసిరావు తదితరులు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ అమర్ భవన్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రతీ గ్రామంలో ఉపాధి హామీ పనులను కల్పించాలని, మెటీరియల్ కాంపోనెంట్‌ను పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే భరించాలన్నారు. కుటుంబ జాబ్ కార్డుతో సంబంధం లేకుండా ప్రతీ ఒక్కరికి విధిగా జాబ్ కార్డు ఇవ్వాలన్నారు. పని ప్రదేశంలో మరణిస్తే రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. ఈ నెల 24న సోమవారం ఉదయం 11 గంటలకు గుంటూరు జిల్లా తాడేపల్లి బైపాస్ ఫీడర్ రోడ్డులో గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయం ముందు తలపెట్టిన ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ధర్నాకు పెద్ద సంఖ్యలో ఉపాధి వేతనదారులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నేతలు దేవుడు, చంద్రుడు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘాల నాయకులు

అప్పలనాయుడు మృతి తీరని లోటు

డెంకాడ: వైఎస్సార్‌సీపీ మోదవలస నాయకుడు, రాష్ట్ర నాగవంశం కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బోని అప్పలనాయుడు మృతి వైఎస్సార్‌సీపీకి, గ్రామ ప్రజలకు తీరని లోటు అని ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండలంలోని మోదవలస గ్రామంలో బోని అప్పలనాయుడు సంస్మరణ సభ మంగళవారం జరిగింది. ముందుగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ అప్పలనాయుడు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించారన్నారు. ఆయన లేని లోటు తీరనిదని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు అంతా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు బద్దుకొండ ప్రదీప్, ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, భోగాపురం మండల పార్టీ అధ్యక్షుడు ఉప్పాడ సూర్యనారాయణ, డెంకాడ పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు రొంగలి కనకసింహాలచం, వైఎస్సార్‌సీపీ నాయకులు కనకల రామారావు, వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా ఉపాధ్యక్షులు బోని బంగారునాయుడు, బుగత రమణ, పలు గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



అప్పలనాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ సురేష్ బాబు తదితరులు

విద్యారంగాన్ని నిర్వీర్యం చేయడాన్ని అడ్డుకోవాలి



ప్రచార బ్రోచర్‌ని విడుదల చేసిన బాలసుబ్రహ్మణ్యం తదితరులు

● మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం

విజయనగరం అర్బన్: విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న పాలకుల చర్యలను అడ్డుకోవడానికి పోరాట పటిమ ఉన్న అభ్యర్థులను మేధావుల చట్టసభలకు పంపాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీల మాజీ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక యూటీఎఫ్ జిల్లా కమిటీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కోసం నికరంగా నిజాయితీగా పోరాడే పీడీఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని గెలిపించాలని ఆయన కోరారు. ప్రస్తుత పాలకులు అనుసరిస్తున్న విధానాలు కారణంగా రాష్ట్రంలో 32 వేల టీచర్ పోస్టులు, 12,247 స్కూల్స్ సంఖ్య తగ్గిపోయిందన్నారు. సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయ పోస్టులు తగ్గిస్తూ ప్రభుత్వ విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. విద్యారంగం భవిష్యత్‌పై ప్రభుత్వం తీరు ఆందోళన కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పీడీఎఫ్ అభ్యర్థులు ఇండిపెండెంట్‌గా వ్యవహరిస్తారని, ఏ రాజకీయ పార్టీలకు ఒత్తాసు పలకడం, పార్టీలు మారడం జరగదని అన్నారు. అనంతరం ప్రచార బ్రోచర్‌ని విడుదల చేశారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, జేఏవీఆర్‌కే ఈశ్వరరావు, జి.నిర్మల, చీకటి దివాకర్, మురళీధర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ సద్వినియోగం కావాలి

● ఐసీడీఎస్ పీడీ బేగం



శిక్షణలో పాల్గొన్న అధికారులు

నెల్లిమర్ల: ప్రభుత్వం అందిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ రుక్సేనా బేగం సూచించారు. నెల్లిమర్ల నగర పంచాయతీ, మండలానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమం జరజాపుపేట ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రారంభమైంది. ఐసీడీఎస్, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో అందిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆమెతో పాటు ఎంఈఓలు ఉపాధ్యాయుల సూర్యనారాయణ మూర్తి, ఈపు విజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలను ఉద్దేశించి పీడీ మాట్లాడుతూ ప్రీ స్కూల్ చిన్నారులకు మరింత మెరుగైన విద్యాబోధన అందించాలనే సత్సంకల్పంతో ప్రభుత్వం 120 గంటల సర్టిఫికెట్ కోర్సును శిక్షణగా అందిస్తోందని చెప్పారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను చిన్నారులకు బోధించాలని పీడీ సూచించారు. రిసోర్స్ పర్సన్లుగా రాజేష్, వాసుదేవాచారి తదితరులు వ్యవహరించారు. సీఆర్పీలు రేవతి, అచ్చిన్నాయుడు, వెంకటరమణ, లక్ష్మణరావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.